క్లుప్తంగా

నాలుగు గ్రామాలకు ఆర్టీసీ బస్సొచ్చింది



రాజురాలో బస్సు వద్ద విద్యార్థులు

సాక్షి స్పందన

ఖానాపూర్: మండలంలోని రాజురా, సింగాపూర్, బావాపూర్(ఆర్), చందునాయక్ తండా తదితర గ్రామాలకు 'రోడ్లు ఉన్నా బస్సు సౌకర్యం సున్నా 'శీర్షికన ఈ నెల 15న సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఇటీవల రూట్ సర్వే చేసిన ఆర్టీసీ అధికారులు ఎట్టకేలకు శనివారం నాలుగు గ్రామాలకు బస్సు సర్వీసులను ప్రారంభించారు. తమ గ్రామానికి వచ్చిన బస్సుకు గ్రామస్తులు స్వాగతం పలికి తోరణాలు కట్టారు. ఎమ్మెల్యే బొజ్జు ఆదేశాల మేరకు బస్సు సర్వీసు ప్రారంభించినందుకు సాక్షికి కృతజ్ఞతలు తెలిపా రు. చిన్నం రవీందర్, నిమ్యానాయక్, లింగన్న, వడ్ల శ్రీదర్, బిక్‌సింగ్, విలాస్, గణేశ్, శంకర్, హెచ్‌ఎంలు సునీల్‌రెడ్డి, అశోక్ ఉన్నారు.

నిత్యం ధ్యానం చేయాలి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సురేశ్

లక్ష్మణచాంద: విద్యార్థులు నిత్యం ధ్యానం, యోగా చేయడం ద్వారా జ్ఞాపకశక్తి పెరుగుతుందని మానసిక వైద్య నిపుణులు డాక్టర్ అల్లాడి సురేశ్ పేర్కొన్నారు. శనివారం లక్ష్మణచాంద ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలశక్తి కార్యక్రమం నిర్వహించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటే ఏకాగ్రత పెరుగుతుందని పేర్కొన్నారు. హెచ్‌ఎం రాజునాయక్, ఉపాధ్యాయులు హరిప్రసాద్, అశోక్ పాల్గొన్నారు.

పాఠశాలలో మాక్ పోలింగ్



ఎన్నికల విధుల్లో విద్యార్థులు

లక్ష్మణచాంద: మండలంలోని పార్‌పెల్లి ఉన్నత పాఠశాలలో శనివారం మాక్ పోలింగ్ నిర్వహించారు. విద్యార్థులకు ఓ టు వేసే విధానం, అభ్యర్థుల ఎంపిక, ఓట్ల లె క్కింపు విధానంపై అవగాహన కల్పించారు. కొందరు విద్యార్థులే ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. ఎన్నికల్లో పోటీ చేసి గెలిచిన విజేతలకు సర్టిఫికెట్లు అందించి ప్రమాణ స్వీకారం చేయించారు. హెచ్‌ఎం మోహన్, ఉపాధ్యాయులు గంగ సురేశ్, పోశెట్టి, ఆదిల్, రవికుమార్ ఉన్నారు.

కరాటే గ్రేడింగ్ పరీక్షలు

నిర్మల్‌టౌన్: జపాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్మల్ అమ్ముల భూషణ్ కరాటే అకాడమీలో విద్యార్థులకు కరాటే గ్రేడింగ్ పరీక్షలు శనివారం నిర్వహించారు. సీనియర్ బ్లాక్ బెల్ట్–2లో ఆరిఫ్‌ఖాన్, నారాయణ, బ్లాక్ బెల్ట్–1లో వకుల్‌రెడ్డి, షేక్ అమన్, ఇర్ఫాన్‌ఖాన్ ఉత్తీర్ణులయ్యారు. తెలంగాణ చీఫ్ ఎగ్జామినర్ తేజేంద్రసింగ్ భాటియా విద్యార్థులకు బ్లాక్ బెల్ట్‌లు, సర్టిఫికెట్లు అందజేశారు. జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, భూషణ్, వినయ్ పాల్గొన్నారు.

అధికారులతో సమావేశం

కుభీర్: ఉత్తమ పంచాయతీ అవార్డు ఎంపిక కోసం తమ పంచాయతీ పరిధిలో 10 శాఖల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎంపీడీవో సాగర్‌రెడ్డి, తహసీల్దార్ శివరాజ్ పేర్కొన్నారు. శనివారం కుభీర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అధికారులకు, సి బ్బందికి సమావేశం నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు త్వరగా ప్రారంభమయ్యేలా చూడాలని పేర్కొన్నారు. ఎంపీవో మోహన్‌సింగ్, ఏవో సారిక,ఏపీవో హరిలాల్, పశువైద్యాధికారి విశ్వజిత్, పీహెచ్‌సీ వైద్యులు రాథోడ్ విజయ్ తదితరులు ఉన్నారు.

'విద్యుత్ లైన్ పనులు చేస్తాం'

లక్ష్మణచాంద: ధర్మారం గ్రామస్తుల సమస్యను పరిష్కరిస్తామని విద్యుత్ డీఈ నాగరాజు పేర్కొన్నారు. మండలంలోని పీచర సబ్‌స్టేషన్ నుంచి ధర్మారం సింగిల్ ఫేజ్ లైన్ వేసే క్రమంలో పీచర గ్రామస్తులు అభ్యంతరం తెలుపడంతో పనులు నిలిపివేశారు. సమస్య పరిష్కరించాలని ధర్మారం గ్రామస్తులు కలెక్టరేట్‌లో, డీఈ నాగరాజును కలిసి విన్నవించినా పనులు చేపట్టలేదు. శనివారం ధర్మారం వీడీసీ ఆధ్వర్యంలో పీచర సబ్‌స్టేషన్‌కు వెళ్లి పనులు ఎప్పుడు చేస్తారో చె ప్పాలని సిబ్బందిని ప్రశ్నించారు. ఏఈ మహేశ్ మాట్లాడినా సంతృప్తి చెందలేదు. డీఈని పిలిపించాలని పట్టుబట్టారు. అనంతరం డీఈ నాగరాజు అక్కడకు వచ్చి సర్దిచెప్పా రు. పదిరోజుల్లో విద్యుత్ లైన్ పనులు పూర్తి చేస్తామని డీఈ హామీ ఇవ్వడంతో గ్రామస్తులు అక్కడ నుంచి వెళ్లిపోయారు.

మృత్యుపిలుపులు.. ఈ మలుపులు

- అధ్వానంగా కుంటాల–కల్లూరు రోడ్డు
- ఈమార్గంలో నిత్యం ప్రమాదాలు
- హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయని అధికారులు



అందకూర్ చెరువు కట్ట వద్ద..

కుంటాల: ప్రజలకు రవాణా సౌకర్యం సులభతరం చేసేందుకు ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చించి రోడ్లు నిర్మిస్తోంది. కుంటాల మండలంలోని కల్లూరు నుంచి కుంటాల వరకు 8 కిలోమీటర్ల మేర ఆర్అండ్‌బీ నిధులు రూ.14 కోట్ల 14 లక్షలతో రోడ్డు నిర్మించారు. కానీ ఈ మార్గంలో మలుపులు ఉండటంతో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. కల్లూరు నుంచి కుంటాల వరకు సుమారు 10 ప్రమాదకర మలుపులు ఉన్నాయి. కుంటాల పోలీస్‌స్టేషన్, వెంకూర్, అందకూర్ గ్రామాల వద్ద నాలుగు మలుపులను డెత్ స్పాట్ మలుపులుగా గుర్తించారు. ఈ మార్గం గుండానే సారంగాపూర్, కుబీర్, బోథ్ మండలాలతోపాటు మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాలకు ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు.

కానరాని స్పీడ్‌బ్రేకర్లు, ప్రమాద సూచికలు..

ఈ మార్గంలో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నా.. అధికారులు మలుపుల వద్ద స్పీడ్‌బ్రేకర్లు, ప్రమాద సూచికబోర్డులు ఏర్పాటు చేయడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు వేడుకుంటున్నారు.



అందకూర్ గ్రామం వద్ద..



వెంకూర్ వద్ద ప్రమాదకర మలుపు



కుంటాల పోలీస్‌స్టేషన్ సమీపంలో

నిర్మల్ ఎమ్మెల్యే 'ఏలేటి' దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

సోన్: నిర్మల్‌లో నిర్వహించిన ఇందిరా మహిళాశక్తి సంబరాల్లో సీఎం రేవంత్‌రెడ్డిపై బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ శనివారం సోన్ మండలకేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మహేశ్వర్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ మహేశ్వర్‌రెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తున్నామని.. వెంటనే సీఎంకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మధుకర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కృష్ణప్రసాద్‌రెడ్డి, మాజీ సర్పంచులు వినోద్‌కుమార్, రాజనర్సింహరెడ్డి, మొహినుద్దీన్, ట్రస్మా అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ అంబేద్కర్ ప్రసాద్, కాంతయ్య, గడ్డం స్వామి, గంగాధర్, మేక ప్రేమ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బోనమెత్తి.. అమ్మకు మొక్కి..



తానూరు: కోలూరు ప్రాథమిక పాఠశాలలో బోనాలతో విద్యార్థులు

తానూరు/భైంసారూరల్/కుంటాల/మామడ: తానూరు మండలంలోని కోలూరు ప్రాథమిక పాఠశాలలో, భైంసా మండలంలోని మహాగాం ప్రాథమిక పాఠశాలలో, కుంటాల మండలం లింబా(కె) జెడ్పీ ఉన్నత పాఠశాల, కల్లూరు వాసవి కళాశాలలో, మామడ మండలంలోని పాఠశాలల్లో శని వారం బోనాల పండగ నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు అమ్మవారి వేషధారణ, పోతరాజుల విన్యాసాలతో ఆకట్టుకున్నారు. బోనాలు ఎత్తుకొని అమ్మవారి ఆలయానికి వెళ్లి నైవేద్యం సమర్పించారు. తానూరు ఎంఈవో నరేందర్, కాంప్లెక్స్ హెచ్‌ఎం మల్లన్న, మహాగాం పాఠశాల హెచ్‌ఎం దేవిదాస్, లింబా(కె)పాఠశాల హెచ్‌ఎం సతీశ్, ఉపాధ్యాయులు హరీశ్, రాగిణి, శ్రీలత ఉన్నారు.

లోకేశ్వరం: మండలంలోని రాజూర, కన్కపూర్ ప్రాథమిక పాఠశాలల్లో బోనాల పండుగ నిర్వహించారు. హెచ్‌ఎంలు రాజేశ్వర్, మెండె వెంకటరమణ, ఉపాధ్యాయులు రజిత, రేష్మ, నాగభూషణ్ తదితరులు ఉన్నారు.



ఖానాపూర్‌లోని ఓ పాఠశాలలో..

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని వాసవి ప్రైమరీ పాఠశాలలో బోనాల పండుగ నిర్వహించారు. పోతారెడ్డి, జగదీశ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సుహాసిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని ధ్రువ హైస్కూల్, ఇషాన్ స్కూల్, ఏసీఈ స్కూల్ తదితర పాఠశాలల్లో బోనాల ఉత్సవాలను నిర్వహించారు.



కుంటాల: లింబా(కె) పాఠశాలలో..



లోకేశ్వరం: రాజూర ప్రాథమిక పాఠశాలలో..



భైంసారూరల్ : మహాగాం ప్రాథమిక పాఠశాలలో



నిర్మల్‌లోని పాఠశాలలో బోనాలతో విద్యార్థులు

కేంద్ర పథకాల అమలు పరిశీలన

భైంసారూరల్: మండలంలోని తిమ్మాపూర్, బిజ్జూర్ గ్రామాల్లో శనివారం కేంద్ర ప్రభుత్వ పథకాల అమలును ఎన్ఎల్ఎం(జాతీయస్థాయి పర్యవేక్షణ) బృందం సభ్యులు నారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. ఉపాధిహామీ నర్సరీలు, సెగ్రిగేషన్ షెడ్లు, ప్లాంటేషన్, ఇంకుడుగుంతలు, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, సడక్ యోజన, ఆయిల్‌పాం సాగు వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులను అడిగి రుణాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఏపీవో లక్ష్మారెడ్డి, ఈసీ రాజ్‌కుమార్, ఐకేపీ ఏపీఎం లక్ష్మణ్, సిబ్బంది ఉన్నారు.



తిమ్మాపూర్‌లో తోట పరిశీలిస్తున్న సభ్యులు

సంక్షిప్త వార్తలు

● కిచెన్ గార్డెన్ ఏర్పాటు

కుంటాల: మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో శనివారం కిచెన్ గార్డెన్‌ను ఏర్పాటు చేశారు. కిచెన్ గార్డెన్‌లో పండించే కూరగాయలను మధ్యాహ్న భోజనానికి వినియోగిస్తామని ప్రిన్సిపాల్ కాసు నవీన్‌కుమార్ పేర్కొన్నారు.

● గణిత ఉపాధ్యాయుడిని నియమించాలి

నిర్మల్: నర్సాపూర్(జి) మండలకేంద్రంలోని ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిని నియమించాలని కోరుతూ శనివారం గ్రామస్తులు నిర్మల్‌లో డీఈవో రామారావు, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌కు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. ఇక్కడి గణిత ఉపాధ్యాయుడు సయ్యద్ సర్ఫరా జ్‌ను మరో చోటకు బదిలీ చేయగా పాఠశాలలో పోస్టు ఖాళీ ఏర్పడింది. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ఉపాధ్యాయుడిని లేదా సయ్యద్ సర్ఫరాజ్‌ను తిరిగి పాఠశాలకు పంపాలని గ్రామస్తులు వినతిపత్రంలో కోరారు.

● పుస్తకాలు పంపిణీ

తానూరు(ముధోల్): ముధోల్ మండలంలోని చించాల గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మైనార్టీ విభాగం ఇన్‌చార్జి లతీఫ్ పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల సిబ్బంది, లతీఫ్‌ను సన్మానించారు. ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్, ఎన్ఎస్‌యూఐ నాయకులు శశికుమార్, విష్ణు, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

● 'ఎమ్మెల్యేపై విమర్శలు మానుకోవాలి'

భైంసాటౌన్: విపక్ష నాయకులు ముధోల్ ఎమ్మెల్యే పి. రామారావు పటేల్‌పై అనవసర విమర్శలు మానుకోవాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు రావుల రాము శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల బీఆర్ఎస్ నాయకుడు విలాస్ గాదేవార్ ఎమ్మెల్యేపై అనవసర విమర్శలు చేశారని అన్నారు. బాసర ఆలయ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే మంత్రుల సమక్షంలో తన ఆవేదన వెళ్లగక్కితే.. దానిని తప్పుపట్టడం సరికాదన్నారు. బాసర ఆలయ అభివృద్ధికి నిధులు ఇవ్వాలని.. లేదంటే భిక్షాటన చేసైనా ఆలయాన్ని అభివృద్ధి చేసుకుంటామని ఎమ్మెల్యే మాట్లాడిన మాటలను వక్రీకరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేను విమర్శిస్తే ఊరుకోబోమని పేర్కొన్నారు.

తానూరు(ముధోల్): ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న ఎమ్మెల్యే రామరావ్ పటేల్‌పై బీఆర్ఎస్ నాయకులు విలాస్ గాదేవార్ అనుచిత వాఖ్యలు చేస్తే ఊరుకోబోమని బీజేపీ నాయకులు, మాజీ ఎంపీటీసీ దేవోజీ భూమేష్, లక్ష్మీనారాయణ హెచ్చరించారు. ముధోల్‌లో వారు మాట్లాడారు.

● ఘనంగా ఫుడ్ ఫెస్టివల్

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శనివారం ఖానాపూర్ మున్సిపల్ ఆధ్వర్యంలో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన ఆహార పదార్థాలు, ఉత్పత్తులను ప్రదర్శించారు. అనంతరం కమిషనర్ సుందర్‌సింగ్ అందించే రుణాలను సభ్యులకు వివరించారు. ఈ విషయమై త్వరలో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మెప్మా పీడీ సుభాశ్, చిన్నం సత్యం, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

● గోరింటాకు వేడుక

కుంటాల: ఆషాఢమాసం సందర్భంగా మండలంలోని కల్లూరు వాసవి కళాశాలలో శనివారం గోరింటాకు వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాళ్లు సాయిలు, శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● తహసీల్దార్ ఎదుట బైండోవర్

ఖానాపూర్: డబ్బుల విషయమై గొడవ పడిన పట్టణానికి చెందిన పలువురిని శనివారం తహసీల్దార్ సుజాత ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. ఫెరోజ్‌ఖాన్, షేక్ ఇర్ఫాన్, సయ్యద్ నజీర్, సయ్యద్ బాబు డబ్బుల విషయంలో గొడవపడ్డారు. సత్ప్రవర్తనలో భాగంగా వారిని హెచ్చరిస్తూ బైండోవర్ చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

● కుక్కల దాడిలో గొర్రెలు మృతి

కుంటాల: మండలకేంద్రంలోని కొత్త కాలనీ శివారులో శనివారం మధ్యాహ్నం చేనులో మేస్తున్న గొర్రెల మందపై కుక్కలు దాడి చేశాయి. ఈ ఘటనలో రెండు జీవాలు అక్కడికక్కడే మృతిచెందాయి. గొర్రెల విలువ రూ.10 వేలు ఉంటుందని ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితుడు కక్కెర ముత్యంరావు వేడుకుంటున్నాడు.

యాత్రికుల చెంతకే ఆర్టీసీ



కుంటాల నుంచి వేములవాడ బయల్దేరి వెళ్తున్న యాత్రికులు

కుంటాల: ఆధ్యాత్మిక, తీర్థ, విజ్ఞాన, విహార యాత్రల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోందని భైంసా డీఎం హరిప్రసాద్ పేర్కొన్నారు. 30 మంది ప్రయాణికులుంటే వారి వద్దకే బస్సు వస్తుందని తెలిపారు. కుంటాల నుంచి వేములవాడ, కొండగట్టు, ధర్మపురి వెళ్లే బస్సును శనివారం ప్రారంభించారు. ఒక్కరోజు ట్రిప్‌నకు పెద్దలకు రూ.620, పిల్లలకు రూ.330 టికెట్ చార్జీ వసూలు చేస్తున్న ట్లు వెల్లడించారు. ప్రైవేట్ కన్నా ఆర్టీసీ బస్సుల్లో చార్జీలు తక్కువ ఉన్నాయని పేర్కొన్నారు. సీఐ భారతి, హెడ్ కానిస్టేబుల్ భగవంత్ రావు, వీబీవో శ్రీనివాస్, సిబ్బంది రాజేశ్వర్, మల్లికార్జున్ పాల్గొన్నారు

సైకిళ్లు అందించిన దాతలు

ఖానాపూర్: మండలంలోని బీర్నంది జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులకు శనివారం దాతల సాయంతో సైకిళ్లు పంపిణీ చేసినట్లు హెచ్‌ఎం జీఎల్‌వీ ప్రసాద్ తెలి పారు. గ్రామానికి చెందిన సాగి చంద్రహాస్, పట్టణానికి చెందిన గుండేటి గణేశ్, కమ్మల ప్రకాశ్ అందించిన డబ్బులతో సైకిళ్లను కొన్నట్లు పేర్కొన్నారు. బీర్నంది పంచాయతీలోని తుమ్మగూడెం, ఇప్పమాడ గ్రామాలకు చెందిన నైతం లక్ష్మి, అర్చన, కనక లచ్చు, శిరీష, మానస, ఎస్.లక్ష్మి అనే విద్యార్థులకు సైకిళ్లు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్‌రావు, శ్రీనివాస్, కాంప్లెక్స్ హెచ్‌ఎం రమాదేవి, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

డాక్టరే రాకుంటే ఎవరు వైద్యం చేస్తారు?

- ఎమ్మెల్యే రామారావు పటేల్
- ఆకస్మికంగా తానూరు పీహెచ్‌సీ తనిఖీ

తానూరు: ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టరే లేకుంటే రోగులకు ఎవరు వైద్యం చేస్తారని.. సిబ్బంది సమయపాలన పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఉదయం 11 గంటల ప్రాంతంలో తానూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉద్యోగుల వివరాలతో కూడిన హాజరు రికార్డు పరిశీలించి.. డాక్టర్, పలువురు సిబ్బంది రాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం డీఎంహెచ్‌వో రాజేందర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. విధులకు గైర్హాజరయ్యే వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బంది అందుబాటులో ఉండి.. పేదప్రజలకు వైద్యం అందేలా ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఆసుపత్రిలో నిల్వ మందుల వివరాలను తెలుసుకున్నారు. ఆయన వెంట నాయకులు, లక్ష్మణ్‌రెడ్డి, శివాజీ పటేల్, యాతలం చిన్నారెడ్డి, సోమ్‌నాథ్, సూపర్‌వైజర్ అబ్దుల్ కాసీం, ఫార్మసిస్ట్ సదానందం, సిబ్బంది తదితరులు ఉన్నారు.



తానూరు: డీఎంహెచ్‌వోతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావ్ పటేల్

ఆర్ఎంపీలకు శిక్షణ ఇప్పించేందుకు కృషి

భైంసాటౌన్: ఆర్ఎంపీ, పీఎంపీలకు శిక్షణ ఇప్పించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ముధోల్ ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ అన్నారు. శనివారం పట్టణంలోని తన నివాసంలో భైంసా డివిజన్‌కు చెందిన ఆర్ఎంపీలు ఆయనను కలిసి తమ సమస్యలు వివరించారు. ప్రజలకు తక్కువ ఖర్చుతో వైద్యసేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. నిబంధనల పేరిట అధికారులు వేధిస్తున్నారని ఎమ్మెల్యేకు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆర్ఎంపీలు ప్రభుత్వ నిబంధనల మేరకు వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆర్ఎంపీల సంఘం డివిజన్ అధ్యక్షుడు మోహన్, కార్యదర్శి పోశెట్టి, గౌరవ సలహాదారు గంగాధర్, మండలాధ్యక్షులు తదితరులున్నారు.

మత్తుకు దూరంగా ఉండాలి

- ఏఎస్పీ ఉపేంద్రరెడ్డి

నిర్మల్‌టౌన్: విద్యార్థులు డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు దూరం ఉండాలని నిర్మల్ ఏఎస్పీ ఉపేంద్రరెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలోని విజయ హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యారు. ఎన్నికైన విద్యార్థులకు బ్యాడ్జీలు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యార్థులు బాల్యం నుంచి నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని సూచించారు. క్రమశిక్షణ, మంచి నడవడికతో మెలగాలన్నారు. దేశభక్తి కలిగి ఉండాలని తెలిపారు. సోషల్ మీడియా వినియోగం తగ్గించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, జనరల్ సెక్రెటరీ అయ్యన్నగారి భూమయ్య, వైస్ చైర్మన్ అంబరాణి, ట్రెజరర్ ఆడేపు సుధాకర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ విజయలక్ష్మి, పాఠశాల కరెస్పాండెంట్ మంచిరాల నాగభూషణం, ప్రిన్సిపల్ సామ మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థికి బ్యాడ్జీ పెడుతున్న ఏఎస్పీ ఉపేంద్రరెడ్డి

ప్రమాద ఘంటిక..



ఇంద్రానగర్ కాలనీలో..

జిల్లాకేంద్రంలోని ప్రధాన కాలనీల్లో నాలాలు ప్రమాదకరంగా మారాయి. ఇంద్రానగర్, గాంధీచౌక్, రవినగర్, కాల్వగడ్డ ఏరియాల్లో నాలాల పక్కన చిన్నారులు ప్రమాదకరంగా ఆటలాడుతున్నారు. వర్షాకాలం కావడంతో నాలాలకు వరద ప్రవాహం అధికంగా ఉంటుంది. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



గాంధీచౌక్ ఏరియాలో..

చెరువు కాదు.. ఇది రోడ్డే



సారంగపూర్: మండలకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కాంప్లెక్సు ఎదుట ప్రధాన రహదారి చెరువును తలపిస్తోంది. శనివారం చిన్న వర్షానికే రోడ్డుపై వరద నిలవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డుపై వరద నిలవకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.